క్లుప్తంగా

11న ఉచిత హోమియోపతి హెల్త్ క్యాంప్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆస్థాన మండపంలో ఈ నెల 11న శుక్రవారం ఉచిత హోమియోపతి హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. తిరుపతి కేర్ హోమియోపతి ఆస్పత్రి వారు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆలయ సిబ్బందికి, పరిసర గ్రామస్తులు ఉచితంగా వైద్య సేవలు నిర్వహిస్తున్నారన్నారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గద్దర్‌కు నివాళులు



మహాసముద్రంలో గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

బంగారుపాళెం: ప్రజా గాయకుడు గద్దర్‌కు మండలంలోని మహాసముద్రంలో సోమవారం అభిమానులు నివాళులర్పించారు. దళితవాడలో గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దళిత నాయకుడు కృష్ణన్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పాటల రూపంలో ఎలుగెత్తి చాటిన సాంస్కృతిక సైనికుడు గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో అభిమానులు, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బంగారుపాళెం: మండలంలోని రాగిమాను పెంట సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ఉండదని ఏఈ రామిరెడ్డి తెలిపారు. రాగిమానుపెంట సమీపంలోని ఎక్స్‌ప్రెస్ హైవేలో విద్యుత్ మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాహితీ వేత్త మృతి



మృతదేహం వద్ద ఎమ్మెల్యే, రచయితలు



బాలరాజు (ఫైల్)

చిత్తూరు అర్బన్: రోడ్డు ప్రమాదంలో రచయిత, సాహితీవేత్త మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, చిత్తూరు కణ్ణన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసి రిటైర్ అయిన బాలరాజు (65) నగర శివారుల్లోని కోడిగుట్ట వద్ద కాపురముంటున్నారు. చిత్తూరు నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరారు. బెంగళూరు హైవే వైపు వెళుతున్న లారీ ఢీ కొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. బాలరాజు పార్థివ దేహానికి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, అభ్యుదయ రచయిత సంఘం జిల్లా అధ్యక్షులు గంటామోహన్, నాయకులు శరశ్చంద్ర తదితరులు నివాళులర్పించారు.


వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన సుప్రియ

గుడిపాల: ఫ్యాన్‌కు ఉరివేసుకొని మహిళ మృతి చెందినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు, చింతగుంటూరుకు చెందిన వనిత కుమార్తె సుప్రియ(22) మూడేళ్ల క్రితం కట్టకింద పల్లె దళితవాడకు చెందిన బాలాజీని ప్రేమవివాహం చేసుకొంది. అయితే ఆమె గత కొద్దిరోజులుగా మానసిక స్థిమితం కోల్పోతూ ఉండేది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రక్షిత అన్నారు. మండలంలోని కమ్మతిమ్మాపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి రక్షిత 55 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలను ఇచ్చారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలత, దివ్య, శిల్ప, కిరణ్‌కుమారి, శివగామి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో స్మార్ట్ వెలుగులు

- ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌పై బోధన
- పాఠశాలలకు చేరుకున్న సాంకేతిక పరికరాలు
- ఐఎఫ్‌పీ వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి



ఐఎఫ్‌పీ ద్వారా బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. జాతీయ విద్యావిధానం అమలు చేసి, ఇతర రాష్ట్రాల వారితో మన విద్యార్థులు పోటీ పడేలా సన్నద్ధం చేస్తోంది. మన బడి నాడు-నేడు ద్వారా కార్పొరేట్‌ను తలదన్నే రీతిలో మౌళిక వసతులు కల్పించి, అభివృద్ధి చేశారు. ఇప్పుడు బోధనలోనూ సాంకేతిక విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రైవేట్, కార్పొరేట్‌లో లేని విధంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) డిస్‌ప్లేలను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసింది. ఈ విధానంతో పాఠశాలల్లో బ్లాక్ గ్రీన్ బోర్డుల ద్వారా బోధనకు స్వస్తి పలికింది. విద్యా వ్యవస్థలో ఇదొక విప్లవాత్మక మార్పుగా విద్యావేత్తలు పరిగణిస్తున్నారు.

ఐరాల మండలంలో..

ఇప్పటికే ప్రభుత్వం ఐరాల మండలానికి నాడు-నేడు ద్వారా ఫేజ్-1 పనులు పూర్తయిన పాఠశాలలకు 26 ఐఎఫ్‌పీలు, 4 స్మార్ట్ టీవీలను సమకూర్చింది. కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌కు 10 ఐఎఫ్‌పీలు, ఎం.పైపల్లె ఉన్నత పాఠశాలకు 8 ఐఎఫ్‌పీలు, ఐరాల ఉన్నత పాఠశాలకు 6 ఐఎఫ్‌పీలు, బీరప్పచెరువు, 35 యర్లంపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలకు ఐఎఫ్‌పీలు ఒక్కొక్కటి చొప్పున అందించారు. స్మార్ట్ టీవీలు బీరప్పచెరువు ప్రాథమిక పాఠశాలకు 1, కాణిపాకం ప్రాథమిక పాఠశాలకు 2, కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌కు 1, ప్రస్తుతం నాడు- నేడు ఫేజ్-2 పనులు పూర్తయిన పొలకల జెడ్పీ హైస్కూల్‌కు 8 ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలు,వడ్డిపల్లె, దివిటివారిపల్లె, బెస్తపల్లె, వజ్రాంపల్లె ప్రాథమిక పాఠశాలలకు ఒక్కొక్కటి చొప్పున, ఐరాల ప్రాథమిక పాఠశాలకు 2, పొలకల జెడ్పీ హైస్కూల్‌కు 1 అందించినట్లు ఎంఈఓలు రుషీంద్రబాబు, దామోదర్‌నాయుడు వెల్లడించారు. ప్రస్తుతం ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలను ఆయా పాఠశాలల్లో సాంకేతిక నిపుణులు అమర్చే ప్రక్రియ పూర్తయింది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులను ఏ విధంగా వినియోగించాలనే విషయమై ఇప్పటికే ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చారు.



ఐఎఫ్‌పీ బోర్డులతో ఉపయోగాలు

విద్యార్థులు శ్రద్ధగా నేర్చుకునేందుకు, చిత్రాల ద్వారా బోధన చేయడానికి ఉపయోగకరంగా ఉంటాయి. త్వరగా పాఠ్యాంశాలను గ్రహించగలుగుతున్నారు. తెలివైన వారితోపాటు చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులు సైతం శ్రద్ధగా పాఠాలు వినేందుకు దోహదపడతాయి. గతంలో గ్రాఫ్, మ్యాప్, సైన్స్ చిత్రాలు వేసేందుకు ఎంతో వ్యవధి పట్టేది. ఇపుడు గూగుల్‌లో ఉన్న చిత్రాలను, పాఠాలను చూపిస్తుండడం వలన సమయం ఆదా అయ్యి ఎక్కువగా బోధనకు సమయం ఉంటుంది. దీంతోపాటు ఇలాంటి బోధన ఉపాధ్యాయులకు సులభతరం అవుతోంది.

బోధన సులభతరం



ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌లు వలన బోధన సులభమైంది. విద్యార్థులు ఇంటి వద్ద కూడా ట్యాబ్‌లు ఉపయోగించి పాఠాలు నేర్చుకుంటున్నారు. ఐఎఫ్‌పీల వలన పాఠంలోని అంశాన్ని త్వరగా గ్రహించగలుగుతున్నారు.

– రుషీంద్రబాబు, ఎంఈఓ, ఐరాల

సద్వినియోగం చేసుకోవాలి



విద్యా బోధనలో విప్లవాత్మక మార్పులను ప్రభుత్వం తీసుకొస్తోంది. మన విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీ పడాలనేది ప్రభుత్వ సంకల్పం. ఆ దిశగా అమలు చేస్తున్న విద్యా విధానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంది.

–దామోదర్‌నాయుడు, ఎంఈఓ, ఐరాల

బాగా అర్థమౌతున్నాయి



ఐఎఫ్‌పీ ద్వారా పాఠాలు నేర్చుకోవడం సులభంగా ఉంది. పాఠం మీద సందేహం ఉంటే ఇంట్లో ట్యాబ్‌ల ద్వారా వాటిని వాటిని నివృత్తి చేసుకోగలుగుతున్నాం. ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలు వచ్చిన తర్వాత పాఠాలు మరిన్ని నేర్చుకోవాలనే ఇష్టం పెరిగింది. బోధన సరికొత్తగా, ఆసక్తిగా ఉంది.

–హిమశ్రీ, 9వ తరగతి, ఐరాల

ఆడికృత్తికకు ప్రత్యేక బస్సులు

చిత్తూరు రూరల్: ఆడికృత్తిక మహోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నుంచి తిరుత్తణికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చిత్తూరు టూ డిపో అసిస్టెంట్ మేనేజర్ అల్తాఫ్ తెలిపారు. మంగళవారం భరణి, బుధవారం ఆడికృత్తికలో భాగంగా 20 బస్సులు కేటాయించగా రోజుకు 80 ట్రిప్పులు తిప్పుతామన్నారు. టూ డిపో బస్టాండు ఆవరణలో ఇందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. 50 మంది భక్తులుంటే గ్రామానికే బస్సు పంపుతామన్నారు.

చెరువుకట్ట పరిశుభ్రం



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: కట్టమంచి చెరువు కట్ట ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నగర కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. కమిషనర్ సోమవారం ఉదయం చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు పక్కనున్న మురుగునీటి కాలువను పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ ప్రాంతంలో క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు పక్కనున్న మురుగునీటి కాలువను పరిశీలించి, పూడిక తీయాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ పాల్గొన్నారు.

స్పందన వినతుల సమోదు

నగరపాలక సంస్థలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన పలు వినతులను నగర కమిషనర్ అరుణ స్వీకరించారు. వినతులపై క్షేత్రస్థాయిలో విచారించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం సురేష్, హెచ్ఎం సాగరిక అన్నారు. నగరంలోని తపోవనం వద్ద ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో సోమవారం నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ భారతదేశంలో ప్రజాస్వామ్యయుతంగా నిర్వహిస్తున్న ఎన్నికల విధి విధానాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాల నిర్వహణ కమిటీ బాధ్యతలను విద్యార్థులకు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో ఎన్నికలు నిర్వహించి హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్‌ను ఎంపిక చేశారు. ప్రిన్సిపల్ చక్రధర్, డీన్ ఇక్బాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీ కాలభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో ఆడికృత్తిక మహోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయంలోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామికి బుధవారం ఆడికృత్తిక పూజలు నిర్వహించనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. విశేష ద్రవ్యాలతో అభిషేకం, మహా అలంకరణ, మహా హారతి, ఆలయ ప్రదక్షిక్షణ, గ్రామోత్సవం ఉంటుందని చెప్పారు.

నేడు బియ్యం వేలం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సీజ్ చేసిన బియ్యంను మంగళవారం వేలం వేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు. నిబంధనల మేరకు వేలంలో ఎక్కువ పాడిన వారు 20 రోజుల్లోపు స్టాక్ పాయింట్ నుండి బియ్యం తీసుకువెళ్లాలన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య


- కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన చిత్తూరు ప్రెస్‌క్లబ్ నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిత్తూరు ప్రెస్‌క్లబ్ నాయకులు, జర్నలిస్టులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యకు అనుమతివ్వాలని చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోకనాథం, అశోక్‌కుమార్ కోరారు. ఈ మేరకు చిత్తూరు ప్రెస్‌క్లబ్ నాయకులు సోమవారం కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘ నాయకులు కలెక్టర్‌తో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాహక్కు చట్టం కింద జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యకు అనుమతివ్వాలన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉచిత విద్యకు అనుమతినిచ్చారని తెలిపారు. జిల్లాలో మొదటి సమావేశంలో అక్రిడిటేషన్లు మంజూరు కాని జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల విధులు నిర్వహించే జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. కలెక్టర్ స్పందిస్తూ జర్నలిస్టుల పిల్లల ఉచిత విద్య అంశంపై డీఈవోతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. త్వరలో అక్రిడిటేషన్ల కమిటీ రెండవ విడత సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల పోస్టల్ బ్యాలెట్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ట్రెజరర్ పవన్, ఉపాధ్యక్షులు మహేష్, సీనియర్ జర్నలిస్టులు సుభాష్, శ్రీనివాసమూర్తి, రమేష్‌బాబు, శివప్రసాద్, యాదవేంద్రరెడ్డి, చంద్రప్రకాష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



వారోత్సవాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు

తవణంపల్లె: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐరాల సీడీపీఓ నిర్మల పేర్కొన్నారు. ఉత్తర బ్రాహ్మణపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలామృతం, పిల్లలకు ఇచ్చే పోషకాహారంపై అవగాహన కల్పించారు. మండలంలోని అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తవణంపల్లె వైద్యాధికారి దాత్రేయచౌదరి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లోకేశ్వరి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతగా పెనుమూరు జట్టు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న సర్పంచ్ మణి

పూతలపట్టు: మండలంలోని ఆకనంబట్టు ఎస్సీ కాలనీలో సోమవారం నిర్వహించిన ఫైనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా పెనుమూరు అగ్రహారం జట్టు నిలిచిందని సర్పంచ్ మణి అన్నారు. ఈ టోర్నమెంటు నెల రోజులుగా క్రికెట్ సుశీల్, క్రాంతి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. గెలుపొందిన పెనుమూరు అగ్రహారం జట్టుకు రూ.30,000 బహుమతిగా అందజేశారు. రన్నర్‌ప్‌గా నిలిచిన ఆకనంబట్టు సుశీల్ జట్టుకు రూ.15,000 అందజేశారు. మూడవ బహుమతి రూ.5000 చంద్రపాల్ జట్టుకు అందజేశారు. ఎంఎస్ మణి, నాగరాజు, జ్యోతి, పూర్ణ పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



హెచ్ఎం శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎంఈఓ రుషీంద్రబాబు

ఐరాల: మండలంలోని పి.రెడ్డివారిపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులుకు సోమవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఇటీవల బదిలీపై కాణిపాకం ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన ఆయనకు ఎంఈఓ రుషీంద్రబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, శ్రీనివాసులు ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత టెరిన్‌రెడ్డి, హెచ్ఎం స్వర్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

గుడిపాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. నంగమంగళం సచివాలయంలో సోమవారం కొత్తగా రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారికి నూతన రైస్ కార్డులను ఆయన అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కార్యాలయాల చుట్టూ తిరిగినా రేషన్‌కార్డులు మంజూరయ్యేవి కావని ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వెంటనే కార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. గుడిపాల మండలానికి 155 మందికి కొత్తగా రేషన్‌కార్డులు ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ వేలాయుధం, సర్పంచ్ గుణవతి, పంచాయతీ కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

భూ సమస్య పేరుతో వేధింపులు

చిత్తూరు రూరల్: భూసమస్య పేరుతో తమ కుటుంబాన్ని కొందరు వ్యక్తులు వేధిస్తున్నారని చిత్తూరు మండలం 27 వరదరాజులపల్లికి చెందిన చంద్రశేఖర్, నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పెరుమాళ్లకండ్రిగ గ్రామంలో తమకు కొంత భూమి ఉందని, ఈ భూమిలో 50 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నామని చెప్పారు. ఆ భూమికి సంబంధించిన అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయన్నారు. అయితే కొందరు వ్యక్తులు సమస్య సృష్టిస్తున్నారని చెప్పారు. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయిస్తే, పరిశీలనకు జిల్లా న్యాయస్థానానికి అప్పగించిందన్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు తరచూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికీ తమ కుటుంబ సభ్యులపై ఐదు సార్లు కేసులు పెట్టించారని తెలిపారు. ఈ వేధింపుల నుంచి ఉన్నతాధికారులు రక్షించాలని వారు కోరారు.

మిషన్ ఇంద్ర ధనస్సుపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య కేంద్ర సిబ్బంది

పూతలపట్టు: మండల కేంద్రంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది కలిసి మిషన్ ఇంద్రధనస్సుపై ర్యాలీ నిర్వహించారు. పోస్టర్లతో పుర వీధుల్లో ర్యాలీగా వెళ్లి ప్రజలకు టీకాలు వేయించుకోవాలని అవగహన కల్పించారు. డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు జరిగే ఇంద్రధనస్సు మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలకు వ్యాధినిరోధక టీకాలను వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ నూర్జహాన్, ఎంఎల్‌హెచ్‌పీలు సురేష్, దయాకర్, నిహారిక, లక్ష్మి, అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

తేనేపల్లి వార్డు ఉపఎన్నికకు కసరత్తు

పూతలపట్టు: మండలంలోని తేనేపల్లి వార్డు మెంబరు ఉపఎన్నికకు పకడ్బందీగా కసరత్తు చేయనున్నట్లు ఎంపీడీఓ గౌరి తెలిపారు. ఆమె సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని తేనేపల్లి వార్డు మెంబర్ ఉపఎన్నికకు 8 నుంచి 10వతేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ, 11వతేదీ నామినేషన్ల పరిశీలన, 12వతేదీ నామినేషన్ల తిరస్కరణపై ఆర్‌డీఓ సమక్షంలో అప్పీలు, 13వతేదీ అభ్యంతరాల పరిష్కారం, 14 వతేదీ నామినేషన్ల విత్‌డ్రా, పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా వెల్లడి ఉంటుదన్నారు. 19 వతేదీ ఉదయం 7 నుంచి 1గంట వరకు పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుదన్నారు. గతంలో తేనేపల్లి ఒకటో వార్డు మెంబరు ఎ.బాబురెడ్డి మృతి చెందడంతో ఆ స్థానానికి ప్రస్తుతం ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వివరించారు.

వినాయక స్వామి సేవలో బాపట్ల కలెక్టర్



స్వామివారి చిత్రపటం అందుకుంటున్న బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా సోమవారం రాత్రి దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సమేతంగా విచ్చేయడంతో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్సు





గాజులపల్లెలో తపస్సుమాను కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, తపస్సుమాను దగ్గర పూజలు చేస్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని గాజులపల్లెలో మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా సోమవారం అర్జున తపస్సు వైభవంగా నిర్వహించారు. దీనికి హాజరైన పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ద్రౌపదీ సమేత ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన తపస్సుమానుకు భక్తితో పూజలు చేసి కార్యక్రమం ప్రారంభించారు. తర్వాత అర్జున వేషధారణలో ఉన్న కళాకారుడు తపస్సుమాను మెట్లు అధిరోహించారు. తపస్సుమానుపై నుంచి భక్తులకు వీభూది పండ్లు, బిల్వాకులు, నిమ్మకాయలను విసిరి వేశారు. సంతానం లేని మహిళ భక్తులు తపస్సుమాను దగ్గర తడి బట్టలతో ప్రదక్షిణలు చేసి వరపడ్డారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సురేష్, మాజీ సర్పంచ్ రాజేష్, కార్యనిర్వహకుడు వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు హరికృష్ణారెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, మధుకుమార్, స్థానికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.